సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	32	24
తిరుపతి	32	19
తిరుమల	28	20
గూడూరు	32	21
నగరి	32	20

వెంటనే స్థలం కేటాయించండి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఏర్పాటు చేస్తున్న భారత రక్షణ రంగ సంస్థకు తొమ్మిది ఎకరాలు వెంటనే కేటాయించాలని సీసీఎల్‌ఏ కార్యదర్శి జి.సాయి ప్రసాద్ జేసీని ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన విజయవాడ నుంచి జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత రక్షణ రంగ సంస్థ (డీఆర్‌డీఓ)కు సంబంధించిన కార్యాలయాలు జీడీ నెల్లూరు వద్ద ఏర్పాటు చేయాలని భావించినట్లు తెలిపారు. అందుకోసం 9 ఎకరాల స్థలాన్ని వారికి అప్పగించాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

లీజుకు ఆర్టీసీ స్థలాలు



వ్యాపారులతో చర్చిస్తున్న డీఎం ప్రశాంతి

పుత్తూరు రూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని 1.07 ఎకరాల స్థలంతో పాటు, 52 సెంట్లు, 86 సెంట్ల విస్తీర్ణం ఉన్న వేర్వేరు స్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకు పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రశాంతి తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలోని తన కార్యాలయంలో గురువారం రిలయన్స్ సంస్థ సభ్యులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టెండర్ డాక్యుమెంట్ ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.5 వేలు, జీఎస్టీతో చెల్లించి, www.apsrtc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టెండర్ ఫారాలను పొందవచ్చని తెలిపారు. టెండర్లను ఈనెల 10వ తేదీలోపు కడపలోని ఈడీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈనెల 20వ తేదీన కడపలోనే నిర్వహించే బహిరంగ వేలంలో దరఖాస్తుదారులు పాల్గొనాలని వివరించారు. వివరాలకు 7331106731, 9959268390ను సంప్రదించాలని కోరారు.

నేడు స్థానిక సంస్థలకు ఉప ఎన్నికలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు శుక్రవారం ఉపఎన్నికలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కలికిరి వైస్ ఎంపీపీ ఎన్నిక ఇప్పటి వరకు జరగలేదన్నారు. గతంలో ఎంపిక కోరం లేక అవ్వలేదన్నారు. పూతలపట్టు వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, చిత్తూరు మండల కో–ఆప్షన్ సభ్యుడు ఖలీల్ మృతి చెందడంతో ఆ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వివరించారు. శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటుందన్నారు. ఫిబ్రవరి 3న ఉదయం 11 గంటలకు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉపసర్పంచ్‌ల ఎంపికకు ప్రత్యేక సమావేశం నిర్వహించి సభ్యులు చేతులెత్తి వారిని ఎన్నుకుంటారన్నారు. కో ఆప్షన్ సభ్యుడి ఎంపిక కోసం అదే రోజు ఉదయం 10 గంటలకు నామినేషన్ స్వీకరణ, ఉపసంహరణ, పరిశీలన అనంతరం గెలిచిన అభ్యర్థి వివరాలను ప్రకటించనున్నట్లు వివరించారు. పరోక్ష ఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ వర్తించదని వివరించారు.

కొమ్మ కొమ్మలో పూసింది

"మామిడి పండు చూస్తే ఆకలేస్తుంది. పూత చూస్తే ఆనందం వస్తుంది'' అన్న చందాన కొమ్మ కొమ్మలో విరబూసిన మామిడి పూత చూసి రైతుల్లో ఆనందం తాండవిస్తోంది. మామిడి పంట సీజన్ ఆరంభంలోనే రైతుల్లో ఆశలకు ఊపిరి పోసింది. పూసిన పూతంతా పిందెగా మారితే రైతు ఇంట సిరులు కురిపిస్తుంది. వరుణుడు కరుణించి, వాతావరణం అనుకూలిస్తే రైతుల మోముల్లో సంతోషం నిండిపోతుంది. నష్టాల్లో ఉన్న రైతుల ఇంటి లాభాల పంట పండుతుంది.



పూతపూసిన మామిడి చెట్లకు మందులు స్ప్రే చేస్తున్న కార్మికులు

- విరగపూసిన మామిడి పూత
- పిందెగా మారేందుకు ఇదే కీలకదశ
- జిల్లాలోని ప్రధాన పంటల్లో ఒకటి
- ఉపాధి పనుల్లో మామిడి చెట్ల పెంపకానికి ప్రాధాన్యం

సాక్షి, చిత్తూరు: మామిడి సీజన్ మొదలైంది. చెట్లలో పూత చూస్తే రైతుకు కడుపునిండిపోతోంది. ఈ సారి మామిడి పంటపై రైతులు ఆశలు పెంచేసుకుంటున్నారు. సాగు చేసిన పంటలో ఏ రకం చెట్టు పూత ఎక్కువగా పట్టిందో అని పరిశీలిస్తున్నారు. ఇప్పుడు కాసిన పూత, కొంచెం కూడా రాలకుండా పిందెగా మారాలంటే ఏం చేయాలా అని ఆలోచిస్తున్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించి సలహాలు తీసుకుంటున్నారు. వరుణుడు కరుణిస్తాడా, వాతావరణం అనుకూలిస్తుందా అన్న అనుమానాలున్నా దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు.

కీలకదశలో పూత

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ కూడా తగ్గడంతో మామిడిలో పూతకు ఇదే అనుకూలం. పూత లేని చెట్లకు సంబంధించి మొదటి విడత మందులు స్ప్రే చేయాల్సి ఉంది. అయితే, పిందె ఏర్పడే దశలో ఉన్న పూత ఉన్న చెట్లకు ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడకూడదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం విరబూసిన మామిడి చెట్లలో దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.



మామిడి పూతను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

2 లక్షల ఎకరాల్లో సాగు

13 లక్షల ఎకరాల భూములున్న జిల్లాలో మామిడి పంట సుమారు 2 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. సాధారణంగా జనవరి నుంచి జూలై చివరి దాకా ఈ సీజన్ కొనసాగుతుంది. మామిడిలో అంతరపంటలు కూడా సాగు చేస్తుంటారు. రుచికరమైన టేబుల్ వెరైటీస్ జిల్లాలో తప్ప మరోచోట లభించవు. ప్రధానంగా తోతాపురి, బంగినపల్లి, మల్గుబ, నీలం, మల్లి వంటి ప్రత్యేక రకాలు సాగవుతున్నాయి. మామిడి రకాల్లో తోతాపురి 80 శాతానికి పైగా సాగవుతోంది. దీన్ని ఎక్కువగా గుజ్జు పరిశ్రమకు ఉపయోగిస్తారు. జిల్లాలో 34 గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాలో పండే తోతాపురి రకం దాదాపుగా ఈ గుజ్జు పరిశ్రమలకే తరలిస్తుంటారు.

ఈసారి అధిక వర్షపాతం

సాధారణంగా జిల్లాలో సాధారణ వర్షపాతం 438 మిల్లీమీటర్లు. మూడేళ్లుగా 900 మిల్లీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదు అవుతోంది. అధిక వర్షపాతం కారణంగా నీటి పారుదల వనరులు పెరిగాయి. భూ గర్భ జలాల మట్టం పెరిగింది. దీని కారణంగా మామిడి పూత విరబూసిందని నిపుణులు చెబుతున్నారు. దీంతో పంట దిగుబడి కూడా అధికంగా వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ముందస్తు చర్యలు

మామిడి పంట అధిక దిగుబడి కోసం జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. నీటిపారుదల తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా మామిడి పంట సాగుకు ప్రోత్సాహం కల్పించింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనుల్లో భారీ ఎత్తున మామిడి చెట్ల పెంపకం చెప్పారు. ఉద్యానవన పంటల్లోనూ మామిడికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రస్తుతం ఇటు అధికార యంత్రాంగం ఒక వైపు, రైతాంగం మరోవైపు మామిడి పంటపైనే దృష్టి సారించింది. విరబూసిన పూతనంతా పిందెగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తోంది.

తెల్లపూత దశలో మందులు పిచికారీ చేయొద్దు



జిల్లాలో ప్రస్తుతం మామిడి చెట్లలో పూత ఎక్కువగా ఉంది. తెల్ల పూత దశలో రసాయన మందులు వాడరాదని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, ఆర్.ప్రసన్న లక్ష్మి తెలిపారు. ఆమె ఇంకా ఏం చెప్పారంటే.. పిందె దశలో తేనెమంచు పురుగు, కాయ తొలుచు పురుగు, మసిమంగు ఆశిస్తాయి. అప్పుడు లామ్డా సహాలోత్రిన్ 1మి.లీ మరియు హెక్సాకొనజోల్ 2మి.లీ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఫిబ్రవరి–మార్చిలో సిఫారసు చేసిన ఎరువులో నాలుగో భాగం చెట్టుకు అందించాలి. పదేళ్లు పైబడిన చెట్లకు ఒక్కో చెట్టుకు 550గ్రా.యూరియా, 1500 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 400గ్రా.మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను చెట్ల పాదుల్లో గాడి తీసి వేయాలి. కాయగా ఎదిగే దశలో థయోమిథాక్సామ్ 0.25గ్రాములు మరియు థయోఫానేట్ మిథైల్ 1గ్రాము చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ దశలో బెనీషా రకంలో ప్రధానంగా నల్లమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. తెగులు ఆశించిన కాయలపై పగుళ్లు ఏర్పడి జిగురులాంటి పదార్థం కారుతుంది. ఈ తెగులు నివారణకు స్ట్రెప్టోసైక్లిన్ 60గ్రాముల చొప్పున 100లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. మామిడి కాయలు నిమ్మపండు పరిమాణంలో ఉన్నపుడు ఫ్రూట్ కవర్లు వాడుకోవడం ద్వారా తెగుళ్లు ఆశించకుండా, నాణ్యమైన, మంచి రంగుతో కూడిన కాయలు పొందవచ్చు. ఏది ఏమైనా అవసరమైతే తప్ప క్రిమిసంహారక మందులు వాడకూడదు.

సబ్సిడీపై ఫ్రూట్ కవర్స్ పంపిణీ



నాణ్యత గల మామిడిని దిగుబడి చేసేందుకు ఫ్రూట్ కవర్స్ అందించాలని ప్రభుత్వాన్ని కోరాం. వీటిని సబ్సిడీ మీద సరఫరా చేయనున్నట్లు అధికారులు చెప్పారు. నాణ్యత గల మామిడి దిగుబడి వచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాము. అవసరమైన రవాణా, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తాం.

– పి.రామచంద్రా రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

అన్నివిధాలా సాయం



చిత్తూరు జిల్లాలో ప్రధానంగా మామిడి పంట మీద ఎక్కువ మంది రైతులు ఆధారపడి ఉన్నారు. ఇక్కడ పండించే మామిడి పండ్లు మంచి నాణ్యత ఉండటం వల్ల విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. అలా చేస్తే మంచి ధరలు వచ్చే అవకాశం ఉంది. అందుకోసమే కలెక్టర్ హరి నారాయణన్ నేతృత్వంలో పలుసార్లు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాం.

– ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్, చిత్తూరు

విదేశాల్లో గుజ్జుకు డిమాండ్



శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు క్రిమిసంహారక మందులు వాడక పోతే, నాణ్యమైన దిగుబడి వస్తుంది. తద్వారా మార్కెటింగ్ బాగా ఉంటుంది. నిపుణుల సూచనల మేరకు మందులు ఉపయోగించుకుని నాణ్యత గల మామిడిని పండించాల్సి ఉంది. గుజ్జు పరిశ్రమలకు నాణ్యమైన పండ్లను పంపితే విదేశాలలో మంచి డిమాండ్ ఉంది.

–గోవర్ధన్ బాబి, జిల్లా పండ్ల పరిశ్రమల సంఘం కార్యదర్శి

ఆర్‌బీకేల సహకారం



మూడేళ్ల నుంచి వర్షాలు బాగా కురుస్తున్నాయి. మామిడి చెట్లు బాగా చిగురించి, పూత బాగా వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా సలహాలు, సూచనలు, శిక్షణ తీసుకుంటున్నాం. ఎరువులు, క్రిమిసంహారక మందుల ఖర్చులు తగ్గాయి. దీంతోపాటు నాణ్యమైన దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

– రమేష్ రెడ్డి, ముతుకువారి పల్లి, పులిచెర్ల మండలం

పశువుల ఎరువే వాడుతున్నాము



మాకు పదెకరాల మామిడి తోట ఉంది. సుమారు 30 ఏళ్ల వయసున్న చెట్లకు పశువుల ఎరువులే వాడుతున్నాము. నాణ్యమైన దిగుబడి వస్తే ఇతర దేశాలకు ఎగుమతి చేయచ్చు. మంచి ధర వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎక్కువగా టేబుల్ వెరైటీస్ చెట్లున్నాయి. ప్రస్తుతం పూత దశ కీలక దశలో ఉంది. వారం రోజుల్లో పూత నుంచి పిందెలు ఏర్పడే అవకాశం ఉంది.

–రాణి ప్రభు, నలగాం పల్లి

హరిపాలనలో 'గృహమే' ప్రథమం

మురుగన్ హరి నారాయణన్.. రెండేళ్ల సర్వీసులో కలెక్టర్‌గా తనదైన ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా 2021 ఫిబ్రవరి 3వ తేదీన ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ రెండేళ్లలో జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జగనన్న గృహ నిర్మాణాల్లో రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టారు. కరోనా కట్టడి, తుపాను సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషించి విజయవంతం చేశారు. చిత్తూరు భౌగోళిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులపై ఒక స్పష్టమైన అవగాహనతో జిల్లాను ప్రగతి పథంలో నడిపించారు. జిల్లాలో రెండేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన గురువారం సాక్షితో ప్రత్యేకంగా ముచ్చటించారు.

– చిత్తూరు కలెక్టరేట్

- గృహ నిర్మాణాల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమం
- జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి నేటితో రెండేళ్లు పూర్తి

ప్ర: జిల్లాలో వ్యవసాయ రంగం స్థితిగతులు ఎలా ఉన్నాయి?

కలెక్టర్ : ఉద్యాన వన, పట్టు, పాడి పరిశ్రమలపై ఆధారపడిన జిల్లా మనది. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిశాయి. శనగల సాగుపై ఎక్కువ ఫోకస్ పెట్టాం. ఉద్యానవన శాఖ పరిధిలో సూక్ష్మ సేద్యంపై ఈ ఏడాది దృష్టిపెట్టాం. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఆర్‌బీకేల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. రైతు పెట్టుబడి తగ్గించి ఆదాయం సమకూర్చే విధంగా ప్రణాళిక అమలుచేస్తున్నాం.



మాట్లాడుతున్న కలెక్టర్ హరి నారాయణన్

ప్ర: జిల్లాలో ఉపాధి హామీ అమలు ఎలా ఉంది?

కలెక్టర్ : జిల్లాలోని 31 మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద 68 లక్షల పనిదినాలు ఇప్పటి వరకు కల్పించాం. ఇంకా దాదాపు 10 లక్షల పనిదినాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని జెడ్పీ, డీఆర్‌సీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు కోరారు. వారి కోరిక మేరకు చెరువుల్లో పూడిక తీత పనులకు ప్రాధాన్యతనిచ్చాం. ఫలితంగా ఆ చెరువుల్లో ప్రస్తుతం నీరు పుష్కలంగా చేరింది.

ప్ర: మహిళలు, పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా?

కలెక్టర్: ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. మన జిల్లాలో రిజిస్ట్రేషన్ చేయడంలో గతంలో గ్యాప్ ఉండేది. ఐసీడీఎస్ శాఖ పరిధిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, ప్రతి గర్భిణీకి రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేలా ప్రోత్సహిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో సామాజిక బాధ్యతతో ఉన్న పౌరుల సహాయం తీసుకుని ముందుకు వెళ్లేలా చర్యలు చేపడుతున్నాం.

ప్ర: జిల్లా అభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలు ?

కలెక్టర్ : పాలనాపరంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో అనేక అభివృద్ధి పనులు చేపడుతోంది.

ప్ర: గృహ నిర్మాణాల పురోగతికి ప్రణాళిక ఎలా ఉంది?



కలెక్టర్ : మనకు చాలా ముఖ్యమైన కార్యక్రమం హౌసింగ్. జిల్లాలో 72 వేల ఇళ్ల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు 21 వేల గృహాలు పూర్తయ్యాయి. ప్రాజెక్ట్ అంచనాలో 53 శాతం నిధులను ఖర్చు చేశాం. మొత్తం బృందం సమష్టిగా చేసిన కృషివల్లే జిల్లాకు నంబర్ వన్ స్థానం దక్కింది. ఎవరో ఒకరు అనుకుంటే కట్టించలేం. లబ్ధిదారుల మోటివేషన్, వారికి అవసరమైన సామగ్రి అందుతుందా లేదా, బిల్లులు సమయానికి వస్తున్నాయా అని ప్రతి ఒక్కటి పర్యవేక్షించి ముందుకు వెళ్తున్నాం.

గ్రామ పరిధిలో 519 సచివాలయాలు, 504 ఆర్బీకేలు, 351 వెల్‌నెస్ సెంటర్లు, 74 పాలసేకరణ కేంద్రాలను, డిజిటల్ లైబ్రరీలను ప్రభుత్వం నిర్మిస్తోంది. రోడ్లను బాగు చేసే దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో రెండు కేంద్ర ప్రభుత్వ రహదారుల పనులు వేగవంతంగా కొనసాగిస్తున్నాం.

ప్ర: జిల్లాకు రానున్న సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్‌ల గురించి..

కలెక్టర్ : ఎన్టీఆర్ జలాశయం అనుసంధానం, పుంగనూరు నియోజకవర్గంలో ఆవులపల్లి, నేతిగుంటపల్లి రిజర్వాయర్లు, ఆగిపోయిన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను సీఎం హామీ మేరకు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. వేసవికాలంలో సైతం తాగు, సాగునీటికి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా జిల్లాలో 1.81 లక్షల ఎకరాలకు సాగునీరు, 10 లక్షల జనాభాకు తాగు నీరు అందించేందుకు 3,468.63 కోట్ల పనులు చేపట్టగా ఇప్పటి వరకు 83 శాతం పనులు పూర్తి అయ్యాయి. కుప్పంలో కొత్తగా రెండు రిజర్వాయర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

ప్ర: జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు అవుతుందా?

కలెక్టర్ : కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు ప్రతిపాదనలను పంపించాం. కొన్ని పరిశీలనలు చేయాలని కేంద్రం ఆదేశించింది. కసరత్తు పూర్తయ్యాక కేంద్రీయ విద్యాలయం నిబంధనలను అనుసరించి ప్రతిపాదనలు కేంద్రానికి పంపుతాం.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరి నారాయణన్ (ఫైల్)

ప్ర: స్పందన ఎలా అమలు చేస్తున్నారు?

కలెక్టర్ : రాష్ట్ర ప్రభుత్వం 2019లో మొట్టమొదటగా ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం. ప్రజా ఫిర్యాదులను జవాబుదారీతనంతో సంతృప్త స్థాయిలో సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లా స్థాయిలో ప్రత్యేక ఆడిట్ టీంను ఏర్పాటు చేసి స్పందన అర్జీల పరిష్కారంపై పర్యవేక్షించాం. 2022 నుంచి జనవరి 2023 వరకు 5,024 అర్జీలు అందగా 4,551 అర్జీలను సకాలంలో పరిష్కరించగలిగాం.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు





టీడీపీ మాజీ కౌన్సిలర్ సలీంకు పార్టీ కండువా వేస్తున్న మంత్రి ఆర్కేరోజా, వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మైనారిటీ నాయకులతో మంత్రి ఆర్కేరోజా

- కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి రోజా
- జగనన్న పారదర్శక పాలనపై టీడీపీ నాయకుల ప్రశంసలు

నగరి : మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ సలీం, రఫీ అనుచరులు ఫాజిల్, భాస్కర్, సత్యవేల్ రెడ్డి, దేవి, సాదిక్, ఈశ్వర, అన్వర్, మనీ, బిలాల్, నారాయణ, లఓఉ్మ, అహ్మద్ వీరితోపాటు 100 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నగరి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి గురువారం విచ్చేసిన వారిని మంత్రి ఆర్కే రోజా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరూ చేయని అభివృద్ధి, సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందుతున్నాయని చెప్పారు. అందుకే టీడీపీ నాయకులు జగనన్నకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. సలీం మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పారదర్శకంగా ప్రతి సంక్షేమ పథకం అమలు చేస్తోందన్నారు. మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టుద్వారా ఎంతో మందిని ఆదుకుంటున్నారని గుర్తుచేశారు. అలాంటి వారికి అండగా ఉండాలని తన వంతు సహకారం అందించాలని వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, నాయకులు ముబా, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, బిలాల్, కోఆప్షన్ సభ్యులు హమీద్ తదితరులు పాల్గొన్నారు.

మీరా సాహెబ్ పాళెంలోనూ..

మండలంలోని మీరాసాహెబ్ పాళెం గ్రామానికి చెందిన టీడీపీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు ఎస్ఎం బాషా, అతనితో పాటు టీడీపీ నాయకులు కె.బాబు, జాఫర్, షారు, మీరా సాహెబ్, అంజాత్, గౌస్‌బాషా, షారూఖాన్, సల్మాన్, కాలేషా, ముషారఫ్, రహీం, షాహుల్, అబ్దుల్లా సీపీలో చేరారు. మంత్రి ఆర్కే రోజా పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ తమ గ్రామాన్ని మంత్రి దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ మంచి చేస్తున్నారన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసేవారితో ఉండాలన్న ఉద్దేశంతో తామందరూ టీడీపీని వదలి పెట్టి గ్రామాభివృద్ధి చేస్తున్న మంత్రి వెంట నడవాలనుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, ఎంపీటీసీలు ఇమ్రాన్,యేసు, నాయకులు సుదర్శనం నాయుడు, జలీల్‌బాయ్, ఆశీం తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష



ఆలయం వద్ద చర్చిస్తున్న అధికారులు, ద్రోణ కన్సల్టెన్సీ ప్రతినిధులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం అభివృద్ధికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ద్రోణ కన్సల్టెన్సీ ప్రతినిధి శ్రీకార్ ఆలయ పరిసరాల్లో మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. కాణిపాకంలో రూ.70 కోట్లతో అభివృద్ధి చేయడానికి న్యూఢిల్లీకి చెందిన ద్రోణ కన్సల్టెన్సీ వారు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆసంస్థ ప్రతినిధులు ఆలయ చైర్మన్, ఈఓ, ఈఈ వెంకటనారాయణలతో కలసి నూతన క్యూ కాంప్లెక్స్, అన్నదాన ప్రసాదం పంపిణీ భవనం పనులకు, బస్టాండ్ సమీపంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాలు పరిశీలించారు. ఆలయానికి వెళ్లే 100 అడుగుల రహదారి డివైడర్లపై పచ్చదనాన్ని పెంచనున్నట్లు చుడా వైస్ చైర్మన్ విశ్వనాథ్ తెలిపారు. ఆయన గురువారం సాయంత్రం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు అరవింద్, శివాంజనేయులు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీలు

పూతలపట్టు: మండలంలోని ముత్తిరేవుల పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. 8వ తరగతికి అందజేసిన ట్యాబ్‌లోని సమాచారం పిల్లలకు అర్థమవుతుందా లేదా అని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సంబంధిత అంశాలపై చర్చించారు. అనంతరం ముత్తిరేవుల గ్రామ సచివాలయాన్ని, రికార్డులను పరిశీలించారు.

మూడో రోజు.. అదే జోరు

- ఉత్కంఠభరితంగా సాక్షి ప్రీమియర్ లీగ్
- సీనియర్, జూనియర్ విభాగాల్లో మ్యాచ్‌లు
- ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరుస్తున్న క్రికెటర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపం తుమ్మలగుంటలోని క్రికెట్ మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మూడవ రోజైన గురువారం క్రికెటర్లు జోరు కొనసాగింది. సీనియర్, జూనియర్ విభాగాల్లో చెరో మూడు మ్యాచ్‌లు చొప్పున 6 మ్యాచ్‌ల్లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచి ఆకట్టుకున్నారు. ఐపీఎల్ తరహాలో జరుగుతున్న ఈ లీగ్ పోటీల్లో ఎలాగైనా ఫైనల్స్‌కు చేరాలనే పట్టుదలతో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నారు. చూడచక్కని షాట్లతో ఫోర్లు, సిక్సర్లతో భారీ ఇన్నింగ్స్ నెలకొల్పగా.. వారికి అండగా బౌలర్లు టపటపా వికెట్లు పడగొడుతూ.. పరుగులకు అడ్డుకట్ట వేస్తూ జట్టును విజయతీరానికి చేర్చడంలో కీలక భూమిక పోషించారు.


మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

గ్రౌండ్ 1 సీనియర్స్ విభాగంలో..

మొదటి మ్యాచ్‌లో మదనపల్లె మిట్స్ కళాశాల జట్టుపై కలికిరి సీకాం కళాశాల జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన మిట్స్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన సీకాం జట్టు 8 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 80పరుగులు చేసి గెలుపొందింది. రెండవ మ్యాచ్‌లో చిత్తూరు వేము-1 కళాశాల జట్టుపై మదనపల్లె విశ్వం కళాశాల జట్టు 27 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విశ్వం జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేయగా వేము జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులు మాత్రమే చేసింది. మూడవ మ్యాచ్ విశ్వం-2, వేము-2 జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. వేము-2జట్టు రాకపోవడంతో అంపైర్లు బై విశ్వం-2 జట్టుకు బై ఇస్తూ విజేతగా ప్రకటించారు.

గ్రౌండ్ 2 జూనియర్స్ విభాగంలో..

మొదటి మ్యాచ్‌లో శ్రీవిద్యానికేతన్ డిప్లొమో కళాశాల జట్టుపై ఎస్వీ ఐటీఐ జట్టు 4 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీ ఐటీఐ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 71పరుగులు చేయగా శ్రీవిద్యానికేతన్ డిప్లొమో జట్టు 10 ఓవర్లో 4 వికెట్ల నష్టానికి 67పరుగులు చేసింది. రెండవ మ్యాచ్‌లో ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టుపై తిరుపతి ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీజీపీ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేయగా.. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎమరాల్డ్స్ జట్టు 8.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. మూడవ మ్యాచ్‌లో రామాపురం ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టుపై వేము పాలిటెక్నిక్ కళాశాల జట్టు 38 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన వేము పాలిటెక్నిక్ జట్టు 10ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 109పరుగులు చేయగా ఎమరాల్డ్స్ జట్టు 10ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 71పరుగులు మాత్రమే చేసింది.

గెలుపొందిన జట్లు

గ్రౌండ్-1
1. సీకాం కలికిరి డిగ్రీ కళాశాల జట్టు
2. మదనపల్లె విశ్వం-1 కళాశాల జట్టు
3. మదనపల్లె విశ్వం-2 కళాశాల జట్టు (బై)

గ్రౌండ్-2
1. ఎస్వీ ఐటీఐ జట్టు
2. తిరుపతి ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు
3. వేము పాలిటెక్నిక్ కళాశాల జట్టు


కలికిరి సీకాం డిగ్రీ కళాశాల జట్టు


ఎస్వీ ఐటీఐ జూనియర్స్ జట్టు


మదనపల్లె విశ్వం-1 సీనియర్స్ జట్టు


వేము పాలిటెక్నిక్ జూనియర్స్ జట్టు


తిరుపతి ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు

ఎంఈవోలు నిత్యం తనిఖీలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరి నారాయణన్, పాల్గొన్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎంఈవోలు క్షేత్రస్థాయిలో నిత్యం పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఎంఈవోలు, విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమ్మేటివ్ పరీక్షల ఫలితాలను ఎంఈవోలు విశ్లేషణ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ ఫలితాల్లో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మెరుగైన ఫలితాల సాధనకు వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచాలని సూచించారు. జగనన్న గోరు ముద్ద నాణ్యత, హాజరు పట్టికలు, ట్యాబ్‌ల వినియోగం, పిల్లల విద్యా సామర్థ్యాలు తదితర అంశాలను ఎంఈవోలు కచ్చితంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. డీఆర్‌డీఏ ఏపీఎంలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులతో, ఎంఈవోలతో సమన్వయం చేసుకుని విధులు నిర్వహించాలని ఆదేశించారు. వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఏఎన్‌ఎంలు విధిగా పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. తనిఖీల్లో జగనన్న గోరుముద్ద నాణ్యత తనిఖీ, టాయిలెట్స్ శుభ్రత, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించాలని తెలిపారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు ఏపీఎంలు, ఎంఈఓలు వారి టూర్ డైరీని జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయాలన్నారు. బయో మెట్రిక్ హాజరుకు సంబంధించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఈవో విజయేంద్రరావు, ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఎంఈవోలు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన యల్లప్ప

గంగవరం: చింతచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు కర్ణాటకకు చెందిన యల్లప్ప(54) కూలీ. మండలంలోని చౌడిరెడ్డిపల్లెకు చెందిన యువతిని పెళ్లి చేసుకుని గ్రామంలోనే స్థిరపడ్డారు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలో ఉన్న చింతచెట్టులో కాయలు రాల్చేందుకు ఎక్కాడు. చింతకాయలు రాలుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. స్పృహ కోల్పోయినట్టు భావించిన స్థానికులు చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్య కేసులో వ్యక్తికి జీవితఖైదు


ముద్దాయి నారాయణ

పుంగనూరు: మహిళ హత్య కేసులో వ్యక్తికి జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి గురువారం తీర్పునిచ్చారు. పుంగనూరు మండలం మొరుంపల్లె గ్రామంలో వెంకటప్ప భార్య పార్వతమ్మ నివసించేది. ఆమె భర్త చనిపోవడంతో అదే గ్రామానికి చెందిన నారాయణతో సహజీవనం చేసేది. ఇలా ఉండగా ఆమె కుటుంబ వ్యవహారాలు చూస్తున్న నారాయణ, పార్వతమ్మ భూమిని అమ్మేసి డబ్బులు తీసుకున్నాడు. ఆ డబ్బు తనకు ఇవ్వాలని అడగడంతో నారాయణ కక్షకట్టి 2015లో ఆమెను అదే ఇంటిలోనే సుత్తితో తలపగులగొట్టి హత్య చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేసి నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో జిల్లా అదనపు న్యాయమూర్తి భాస్కర్‌రావు ముద్దాయికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

లోకేష్ పాదయాత్ర రాష్ట్రానికి అరిష్టం

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


మీడియాతో మాట్లాడుతున్న నారాయణస్వామి

వెదురుకుప్పం: కనీసం వార్డు మెంబర్‌గా గెలవలేని వ్యక్తి, ప్రజల దగ్గర ఛీ కొట్టించుకున్న లోకేష్ చేపట్టిన పాదయాత్ర రాష్ట్రానికి అరిష్టమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి విమర్శనాస్త్రాలు సంధించారు. ఆయన గురువారం మండలంలోని తార్లబైలు గ్రామంలో మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలు తెలియని లోకేష్ చేపట్టిన పాదయాత్రలో చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి ప్రజలకు ఏంచేశారో చెప్పాలని నిలదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గడిచిన మూడున్నరేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు.. అభివృద్ధిపై చర్చకు వస్తారా అని సవాల్ విసిరారు. రాక్షస మనస్తత్వం కలిగిన వ్యక్తి చంద్రబాబు, ఎవరైనా ఎస్సీగా పుట్టాలని కోరుకుంటారా అంటూ ఆయన దళితులను అవమానపరిచారు. అదేవిధంగా బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వారికి అన్ని విధాలా ద్రోహం చేశారు. చంద్రబాబు రక్తం పగ, ద్వేషం, కసితో రగిలిపోతోంది. ప్రజలు తిరస్కరించిన వ్యక్తి చేపట్టిన పాదయాత్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు. యాత్రలో కేవలం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారు తప్ప రాష్ట్ర ప్రజలు కనిపించలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు కులమతాలకు అతీతంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంది. చంద్రబాబు పాలనలో ప్రజలు కరువు కాటకాలతో అల్లాడిపోయారు. చంద్రబాబు, లోకేష్ నారావారిపల్లెలో దళితులను ఆలయాల్లోకి రానిస్తున్నారా చెప్పాలి. కులమతాలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తే చరిత్రహీనులు అవుతారు‘‘ అని నారాయణస్వామి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, ఎంపీటీసీ మురళీరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్బీకేల సేవలు సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు పరికరాలను అందిస్తున్న ట్రైనీ కలెక్టర్

గుడిపాల: ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. మండలంలోనిపానాటూరు రైతుభరోసా కేంద్రంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆర్బీకేల ద్వారా అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. సీహెచ్‌సీ గ్రూపు కింద రూ.15లక్షలతో రైతులకు ట్రాక్టర్, పవర్‌వీడర్, రొటోవేటర్, బ్రష్‌కట్టర్ అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా, ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయాధికారి మాధవి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు తులసిరామ్‌రెడ్డి, హనుమనాయక్ పాల్గొన్నారు.

అక్రమ డీజిల్ వాహనాలు సీజ్



చిత్తూరు కార్పొరేషన్: అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వాహనాలను వాణిజ్య పన్నులశాఖ (సీటీ) అధికారులు సీజ్ చేసి రూ.32 లక్షలు జరిమానా విధించారు. ఈ మేరకు వివరాలను ఆ శాఖ జేసీ (జాయింట్ కమిషనర్) జాన్ స్టీవెన్‌సన్ తెలిపారు. కర్ణాటక నుంచి డీజిల్ అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీనిపై నిఘా పెట్టి అక్రమంగా మూడు వాహనాల్లో డీజిల్ తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ వాహనాలను సీజ్ చేసి రూ.32 లక్షలు జరిమానా విధించామన్నారు. ఆ ట్యాంకర్లను పలమనేరు సర్కిల్ సహాయ కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో పుంగనూరు, పలమనేరు ప్రాంతంలో గుర్తించామని, రెండు వాహనాల్లో రూ.28 లక్షలు విలువ చేసే 28 వేల లీటర్లు, మరో వాహనంలో రూ.4 లక్షలు చేసే 4 వేల లీటర్ల డీజిల్ ఉందన్నారు. ఆ మొత్తం విలువ రూ.32 లక్షలు జరిమానా రూపంలో వసూ లు చేసి వాహనాలను విడుదల చేశామన్నారు.

నేడు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం

- కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లాలో ముగ్గురు విద్యార్థుల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : విదేశాల్లో ఉన్నత విద్య చదవాలన్నది ప్రతి విద్యార్థి కోరిక. అయితే అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో అత్యున్నత శ్రేణి యూనివర్సిటీలో అడుగుపెట్టాలంటే రూ.50 లక్షల నుంచి రూ.1కోటి వరకు ఫీజులు, ఇతరత్రా వ్యయాలకు నగదు చెల్లించాల్సి ఉంటుంది. అంత మొత్తంలో ఫీజులు చెల్లించుకోలేని ఎంతో మంది ప్రతిభావంతులు తమకు వచ్చినా అవకాశాలను సైతం వదులుకోవాల్సిన దుస్థితి. ఇలాంటి విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండేలా జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందజేసే స్కాలర్‌షిప్ నగదు సహాయంతో అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీల్లో ఉచితంగా చదువుకోవచ్చు.

గతంలో రూ.15 లక్షలు..ఇప్పుడు రూ.50 లక్షలు

గతంలో చంద్రబాబునాయుడు పాలనలో విదేశీ విద్యాదీవెన పథకానికి రూ.15 లక్షలు ఇచ్చేది. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ ఒక్కొక్కరికి రూ.50 లక్షలను అందజేస్తున్నారు. అంతర్జాతీయంగా టాప్ 100 యూనివర్సిటీల్లో చేరితే పూర్తి ట్యూషన్ ఫీజు చెల్లించనున్నారు. పకడ్బందీగా నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ చేపట్టారు. జిల్లాలో ఎస్సీ, బీసీ-బీ, ఈబీసీ కులాలకు చెందిన ముగ్గురిని ఎంపిక చేశారు. రానున్న రోజుల్లో ఈ పథకానికి సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఎంపికైన విద్యార్థులు వీరే

చిత్తూరు జిల్లాలో సోమల మండలం బుంగవారిపల్లెకి చెందిన గీతిక, గంగవరం మండలం మాదిగపల్లెకు చెందిన చందన, రామకుప్పం మండలానికి చెందిన లోకేష్ ఎంపికయ్యారు. ఒక విద్యార్థిని ఎంబీబీఎస్ కోసం కజకిస్తాన్‌కి వెళ్లనుండగా, మరో ఇద్దరు అమెరికాకు చెందిన యూనివర్సిటీలకు ఎంపిక అయ్యారని అధికారులు వెల్లడించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జగనన్న విదేశీ విద్యాదీవెన జిల్లా స్థాయి కార్యక్రమం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు.


కుటుంబీకులతో విదేశీ విద్యాదీవెన ఎంపికైన చందన

గంగవరం మండలం కీలపట్ల పంచాయతీ మాదిగపల్లెకుకి చెందిన పిల్లోల్ల సుబ్రమణ్యం, పద్మావతి దంపతుల మొదటి కుమార్తె చందన విదేశీ విద్యాదీవెనకు ఎంపికైంది. వీరిది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు చేసే కూలీ పనితోనే కుటుంబం గడిచే పరిస్థితి. వీరికి నలుగురు బిడ్డలు. మొదటి అమ్మాయి చందన, రెండవ అమ్మాయి జాహ్నవి, మూడో కుమారుడు సాయి బాలాజీ, 4వ కుమారుడు సాయి శ్రీనివాస్. ఈ ఇద్దరు మగ పిల్లలు కవలలు. నలుగురూ చదువులో మంచి ర్యాంకులు సాధిస్తున్నారు. చందనకి చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలన్నది కోరిక. టెన్త్, ఇంటర్‌లో సైన్స్‌లో 10పాయింట్లు చొప్పున సాధించింది. 2019లో ఇంటర్ పూర్తి చేసి నీట్ కోసం రెండేళ్లు నెల్లూరులో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంది. ఆ తర్వాత ఈమెకు వచ్చిన ర్యాంకుల ఆధారంగా విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకుంది. ఈమెను రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యాదీవెన పథకానికి ఎంపిక చేసింది.